


# రామకృష్ణ హైదరాబాద్



## అందరివాడు




1

తొమ్మిది దాటింది.

ఫుట్‌పాత్‌పై కూచుని అతడింకా హిందూ దినపత్రిక చదువుతున్నాడు

2

రోడ్డు.

రోడ్డుకు ఎడమవైపున ఉన్న ఫుట్‌పాత్‌పై అతడు.

కుడివైపు విఘ్నేశ్వరుడు లేదా అతడి దేవాలయం.

దానికున్న ఫుట్‌పాత్‌పై భక్తుల పాదరక్షలు చూసుకుంటూ నలుగురైదుగురు.

అందులో ఒకరిగా కనిపించాల్సిన రామకృష్ణ ఇటువైపు - అంటే దేవాలయం ఎదురుగా ఫుట్‌పాత్‌పై కూచుని కనిపించాడు.

> *ఉదయం దేవాలయం చెంత, రాత్రిళ్ళు, దేవాలయం ఎదురుగా, అదే కార్యాలయం, అదే ఇల్లు. రేయింబవళ్ళూ ఫుట్‌పాత్‌పైనే అతడి జీవితం.*

ఆ ఫుట్‌పాత్ నేలకు కొంచెం ఎత్తున ఉంటుంది. ఆయన దానిపై కూచుంటే ఎడమ కాలి మోకాలి కింది భాగం లేదు.

ఆ కాలు మొండిగా కనిపిస్తోంది. నిజమే. అతడికి ఎడమ కాలు లేదు. తీసేశారు. ఇరవై ఏళ్ళ క్రితం ముంబాయి రేవు వద్ద కూలీగా ఉన్నప్పుడు ఒక లోడ్‌లోంచి ఇనుపరాడ్లు జలజలా దొర్లిపడ్డాయి. వాటికింద అతడి కాలు చితికిపోయింది.

స్పృహ తప్పిపోయిన ఆయన ఆస్పత్రిలోంచి బయటకు వచ్చేటప్పటికి ఒకే కాలు కనిపించింది.

అప్పట్నుంచీ జైపూర్ ఫుట్ అతడికి ఆసరా.

ఆ పెట్టుడు కాలితోనే అతడు హైదరాబాద్ వచ్చాడు వచ్చిననాటి నుంచీ ఇక్కడే, ఇరవై ఏళ్ళుగా ఈ గణేష్ టెంపుల్ దగ్గరే ఉన్నాడు.

పాదరక్షలు చూసుకోవడమే అతడి పని.

3

నడిచేటప్పుడే ఆ పెట్టుడు కాలు తొడుక్కుంటాడు. లేనపుడు అదీ విశ్రాంతి తీసుకుంటుంది. ఇపుడదే దృశ్యం.

ఒక వైపు మొండికాలు. మరో వైపు నేలను ఆనించి కుడికాలు. ఆ పక్కనే ఫుట్‌పాత్‌పై విశ్రమిస్తున్న పెట్టుడు కాలు. అతడి ఒడిలో పత్రికా ప్రపంచం. అందులో తలమునకలై ఉన్నాడు రామకృష్ణ.

అన్నట్టు, ది హిందూ దినపత్రిక, ఆనంద వికటన్ మేగజైన్ ఇవే అతడి కాలక్షేపం, నవ్వూ విచారం కలగలసిన గొంతుతో చెప్పాడాయన.

4

ఆ దేవాలయం వద్ద భక్తుల పాదరక్షలు చూసుకుంటూ ఉండే రామకృష్ణకు దయతలచి ఇస్తే రూపాయో, అర్థానో తీసుకుంటాడు. లేదంటే లేదు. ఈ మధ్య మక్కా మజీద్‌లో బాంబు పేలడంతో సెక్యూరిటీప్రాబ్లం అని ఇక్కడ ఆశ్రయం పొందిన చాలామందిని కూచోవద్దని హెచ్చరించారట. దాంతో ఓ నెలరోజుల పాటు విశ్రాంతి, నవ్వి చెప్పాడాయన.

మరి ఈ నెల రోజులు ఎలా గడుస్తుందని అంటే, ఓ మాసానికి సరిపడా డబ్బులున్నాయి లెండి, అన్నాడు అదే చిరునవ్వుతో

5

అన్నట్టు, మీకెవరూ లేరా?

ఉన్నారు.

మరి.

మా తండ్రి మద్రాసీ, తల్లి హైదరాబాదీ.

నేను పుట్టింది హైదరాబాద్‌లోనే అయినా చిన్ననాడే నేను మద్రాసు వెళ్ళాను. అక్కడ మార్కెటింగ్ విభాగాల్లో కొంతకాలం ఉద్యోగం చేశాను. ఎమర్జెన్సీ సమయంలో నా ఉద్యోగం పోయింది. దాంతో అక్కడినుంచీ ఓ సూట్‌కేస్ తీసుకుని ముంబాయికి చేరుకున్నాను.

నాన్న అంతకు ముందే మరణించాడు. ఇక అక్కడెవరూ లేరని, ఏదైనా మంచి ఉద్యోగం వెతుక్కుందామని ముంబాయి వచ్చాను.

రైలు దిగేసరికి నా సూట్‌కేస్‌పోయింది. టెన్త్ సర్టిఫికెటు ఆ సూట్‌కేస్‌తోనే పోయింది. దిగాలు పడి, ఏదో ఒక ఉద్యోగం అనుకుని పోర్ట్‌లో లోడింగ్ అన్ లోడింగ్ పనిలో చేరాను. ముందే చెప్పానుగా, అక్కడే కాలు పోగొట్టుకున్నాను.

*ఒకసారి దిగజారిన తర్వాత తిరిగి జీవితాన్ని చేజిక్కించుకోవడం అసాధ్యం అన్నట్టు చెప్పాడాయన.*

ఆ తర్వాత ఒక కంపెనీలో ఉత్తరాల సార్టింగ్ చేసే పనిలో కొంతకాలం పనిచేశాను. ఆ కంపెనీ దివాళా తీయడంతో చివరకు నా తల్లిగారి ఊరు హైదరాబాద్‌కు వచ్చాను.

రావడం రావడం నేను పుట్టిన హిమాయిత్ నగర్‌కు చేరుకున్నాను.



రెండు దశాబ్దాల తర్వాత కదా, నేను వచ్చేసరికి దాని రూపురేఖలు మారిపోయాయి. మా బంధువులెవరూ కనిపించలేదు. అమ్మ మనసులో మెదులుతుండగా తీవ్రంగా వెతుకులాడాను. లాభంలేదు.

ఏం చేయాలో తోచక, నిరాశకు లోనై తిరిగి బడలికతో ఈ గణేష్ టెంపుల ఫుట్‌పాత్‌పై ఆ రాత్రి నిద్రించాను.

మరునాడు లేచి కూచున్నాను. ఎవరో అక్కడ పాదరక్షలు విడిచారు. ఇంకెవరో విడిచిన పాదరక్షలు తీసుకుని చేతిలో అర్థరూపాయి పెట్టి పోయారు.

ఆ రోజు గడిచింది.

అలాగే ఈ రెండు దశాబ్దాలు గడిచాయి.

విడిచి వెళ్ళేవారు. తొడుక్కుని వెళ్ళేవారు.

ఇరవై ఏళ్ళుగా నా కళ్ళముందు ఇదే దృశ్యం. అదే నాకు జీవిక, చెప్పి ఆగాడాయన.

6

ఒక సంవత్సరం. అదీ ఒకే ఒక రోజు లెండి.

నా వద్ద వెయ్యి రూపాయలున్నాయి కదా అని వాటితో కొన్ని జతల సాక్స్‌లు కొన్నాను.

రెండు చేతుల్లో రెండు సాక్సులతో రోజూ కూచుండే స్థలానికి కొంచెం అవతల కూచున్నాను.

టెంపుల్ వాచ్‌మెన్ ఎగాదిగా చూశాడు.

మరికొందరు చిరువ్యాపారులు కన్నెర్ర చేశారు.

తమను మించిపోతాననే బాధ.

దిగులు, ఆవేశం, కోపాన్ని వారి చూపుల్లో అర్థం చేసుకున్నాను.

ఒకసారి నిమ్నస్థాయి జీవితం గడిపాక దాన్ని అధిగమించి బతికితే సమాజం ఓర్వలేదేమో.

అది గమనించాక మరీ అలసిపోయాను. వాళ్ళని ఎదుర్కొని నిలవాలని అనిపించలేదు. అంతే, ఆ సాక్సులు వదిలేసి చెప్పులు చూసుకుంటూ ఉండిపోయాను.

మొన్న బాంబులు పేలేదాకా అదే పని, చెప్పి పేపరు ముడిచాడాయన.

7

గంభీర నిశ్శబ్దాన్ని చెదరగొడుతూ, ఇన్నేళ్ళలో మళ్ళీ బంధువులను కలుసుకోవాలనే ప్రయత్నం చేయలేదా అని అడిగితే, ఒకసారి ప్రయత్నించాలనుకున్నాను. కానీ నా వల్ల కాలేదు. బలవంతంగా ఆ కోరికను అణిచిపెట్టే శాను, వివరించాడాయన. ఒకసారి దిగజారిన

తర్వాత తిరిగి జీవితాన్ని చేజిక్కించుకోవడం అసాధ్యం. మళ్ళీ చెప్పాడాయన. చెబుతూ తాను వెతుక్కుంటున్న జీవితాన్ని గురించి మరోసారి వివరించాడు.

*తాను ప్రతి సంవత్సరం జైపూర్‌లో తనకు పెట్టుడు కాలు ఇచ్చిన సంస్థకు డబ్బులు విరాళంగా పంపుతాడట.*

నా వద్ద ఉన్న డబ్బు నాదికాదు. ఎవరో మీ వంటివారే ఇచ్చారు. వాటితో రోజుకు రెండు పూటలా భోజనం చేస్తాను. ఈ ఫుట్‌పాత్‌పై పడుకుంటాను. ఇరవై ఏళ్ళుగా ఇదే జీవితం. నాకేమయినా పిల్లలా, జెల్లలా? అతడి గొంతునిండా విచారం.

అంతలోనే దాన్ని అదిమి పెట్టుకుని ఇలా అన్నాడు. *నా చేతిలో పెట్టే రూపాయిని నేను దుర్వినియోగం చేయను. వాటితో నా కనీస అవసరాలు తీర్చుకుని మిగిలిన డబ్బులను ఏ అనాధాశ్రమానికో లేదా ఆర్థిక సహకారం అవసరమైన బాధితులకో ఎం.ఓ చేస్తుంటాను, ఉత్సాహంగా చెప్పసాగాడు.*

మరేంలేదు, నా వంటి వారికి నేనున్నానని భరోసా అందిస్తాను. వారివద్దనుంచీ నా క్షేమాన్ని కోరుతూ దీవెనలు అందితే సంతోషిస్తాను, కేజువల్‌గా చెప్పాడు.

ఆ ఆనందం, సంతృప్తితో మళ్ళీ రోజు ప్రారంభిస్తాను, ఇదీ తన కథ, అన్నట్టు చెప్పి పేపరు చదవాలన్నట్టు చూశాడతడు.

సెలవు తీసుకుంటుంటే, కళ్ళద్దాలు, చింపిరి గడ్డం మధ్య నిర్మలంగా అతడి మందహాసం.

అతడి చేతులో చేయుంచి మళ్ళీ కలుస్తానని వీడ్కోలు తీసుకున్నాను.

ప్రియ పాఠకులారా...

వీలుంటే ఒకసారి అతడ్ని కలవండి.

అతడి ఇంగ్లీషు కూడా ఎంతో బావుంటుంది.



చిరునామా:
రామకృష్ణ,
కేరాఫ్ గణేష్ టెంపుల్,
సికింద్రాబాద్,
ఆంధ్రప్రదేశ్, భారత్

*****

kandukurirameshbabu@yahoo.co.in